క్లుప్తంగా

ఎన్నికలకు సమాయత్తం కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

హయత్‌నగర్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలను ఎన్నికలకు సమాయాత్తం చేయాలని, పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 16 వార్డు ఇన్‌చార్జి బద్రీనాథ్ అన్నారు. శుక్రవారం తట్టిఅన్నారంలో పార్టీ సీనియర్ నాయకుడు దేవిడి విజయబాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పథకాలు అందని వారికి అందేలా చూడాలని సూచించారు. కొత్తగా ఓటర్లను నమోదు చేయించాలని, పార్టీ ఆశయాలపై యువతకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌గౌడ్, దామోదర్‌గౌడ్, జంగయ్య, సూరయ్య, నర్సింహ్మ, భూషన్, సుక్క బిక్షపతి, నల్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో టీఎన్‌జీఓఎస్ నాయకులు

తుక్కుగూడ: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్‌జీఓఎస్ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం నగరంలోని టీఎన్‌జీఓఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమీక్షలో ఉద్యోగులకు ఆరోగ్య కార్డుల మంజూరు, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్ వర్తింపు తదితర అంశాలపై తీర్మానం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు విజయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరించిన నాయకులు

ఆమనగల్లు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ సంఘం నేతలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. జిల్లా నాయకులు మల్లెపోగు మల్లేష్, పులికంటి మైసయ్య, విజయ్‌చందర్, సుదర్శన్, శివ, గోపాల్, సామ్‌సన్, శివరాం, శ్రీ హరి, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి



దీక్షలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు తదితరులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. అభివృద్ధి పరంగా గ్రామం ముందంజలో ఉన్నా.. మండలముగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. గతంలో 41 రోజుల పాటు దీక్షలు చేశామని, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి, మండలం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం మండలం ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు మండలంలో ప్రొ. కోదండరాం పర్యటన

యాచారం: తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆదివారం యాచారం మండలంలో పర్యటించనున్నారని టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సామ నిరంజన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. తెలంగాణ బచావో పేరుతో ఫార్మాసిటీ బాధిత ప్రాంతాల్లో ప్రజాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటైతే పరిసర ప్రాంతాల గొలుసు కట్టు చెరువులు కలుషితమయ్యే ప్రమాదం ఉందనే ప్రచారం నేపథ్యంలో చెరువులను పరిశీలించనున్నట్లు ఆయన వెల్లడించారు.

పేరుకే పెద్ద మండలం..

- అందని ద్రాక్షగా సర్కారు వైద్యం
- కలగా మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రి
- సుస్తీ చేస్తే నయం చేసేవారు కరువు!
- అందుబాటులో అంబులెన్స్ నిల్
- ఇబ్బంది పడుతున్న మండల ప్రజలు



మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం

కడ్తాల్: మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వాలు, పాలకులు మారినా.. ఇక్కడి ప్రజలు మెరుగైన వైద్యానికి నోచుకోవడం లేదు. చిన్నపాటి రోగం వచ్చినా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి పరుగులు తీయాల్సిందే. సుమారు 40 వేలకు పైగా జనాభా గల కడ్తాల్ మండలంలో ప్రభుత్వ వైద్యం.. ఆరోగ్య ఉప కేంద్రానికే పరిమితమైంది. పేరుకు పెద్ద మండలమే అయినా.. సుస్తీ చేస్తే నయం చేసేవారు దిక్కులేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, డాక్టర్లు ఉన్నా.. వారు పగటిపూటే వైద్య సేవలు అందిస్తున్నారు. రాత్రి వేళల్లో ఏదైనా ఆపద వస్తే.. చికిత్స కోసం హైదరాబాద్‌కు పరుగులు పెట్టాల్సిందే.

తరచూ ప్రమాదాలు

కడ్తాల్ మండల కేంద్రం మీదుగా శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి ఉండడంతో తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా ఆది, మంగళ, గురువారాల్లో మైసిగండికి వచ్చే భక్తులతో పాటు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో రహదారి రద్దీగా ఉంటుంది. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాలంటే 108 వాహనం కోసం వేచి చూడాల్సిందే. అది రావడం ఏమాత్రం ఆలస్యమైనా బాధితులు ప్రాణాల మీద ఆశ వదులుకోవాల్సిందే. చిన్నపాటి గాయాలతో బయటపడ్డవారిని గ్రామంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తుంటారు. అక్కడ సకాలంలో వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

2017లో మైసిగండిలో పీహెచ్‌సీ సెంటర్‌ను ప్రారంభించారు. ఇక్కడ ఇద్దరు వైద్యులను నియమించారు. ఇద్దరిలో ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లగా.. ప్రస్తుతం ఒకరు మాత్రమే ఉన్నారు. ఒక ఫార్మాసిస్టుతో పాటు సూపర్‌వైజర్, ఎంపీహెచ్‌ఈవో ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. స్టాఫ్ నర్స్ పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వలన రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా.. వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు, 108 వాహనం అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా మండల కేంద్రంలో మెరుగైన వైద్య చికిత్సలు అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కనీసం వేతనం రూ.19 వేలు ఇవ్వాలి
- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్
- రెండో రోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె

తలకొండపల్లి: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య, తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతన రూ.19 వేలు చెల్లించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ ఎదుట బైఠాయించి సమ్మె చేస్తున్న కార్మికులకు భాస్కర్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరి విధానాన్ని అమలు చేయాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటయ్య, కురుమయ్య, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, గొర్ల కాపరుల జిల్లా నాయకుడు పెంటయ్య, కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కో కన్వీనర్ రవలి, సభ్యులు యాదమ్మ, బిక్షపతి, అలివేలు, జంగమ్మ, సుగుణమ్మ, లక్ష్మీదేవి, రామచంద్రయ్య, పాండు, పోచయ్య, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

యాచారం: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో కార్మికులు మాట్లాడారు. జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్మికుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య ఆరోపించారు. రెండోరోజు కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలుపుతూ మాట్లాడారు. కార్మికులకు ప్రస్తుతం రూ.8,500వేల వేతనం మాత్రమే ఉందని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పూల యాదయ్య, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.



తలకొండపల్లి: దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న భాస్కర్ తదితరులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చిన్నమ్మ నర్సమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం కడ్తాల్ మండలం చల్లంపల్లిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. నర్సమ్మ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు కృష్ణయ్యయాదవ్, తులసీరాం, హరిచంద్, ఎంపీటీసీ గోపాల్, నాయకులు పత్యానాయక్, రాజేందర్‌యాదవ్, బిక్షపతి, రాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.



నర్సమ్మ పార్థివదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఎల్మినేడు విద్యుత్ ఫీడర్, ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన గోలి



మంత్రి కేటీఆర్‌ను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ సమస్యల గురించి మంత్రి వద్ద గోలి ప్రస్తావించారు.

బుగ్గయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం



బుగ్గయ్యగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: ఆమనగల్లు మాజీ ఎంపీపీ పాలకూర్ల బుగ్గయ్యగౌడ్ ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా ఈ ప్రాంత ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పేర్కొన్నారు. బుగ్గయ్యగౌడ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీలు ఉమావతి, రాములుగౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లేశ్ కుటుంబానికి అండగా ఉంటామని నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారీలు చెప్పారు. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన మల్లేశ్ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బాలాజీసింగ్, ఆచారీలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సహాయం చేయగా.. జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు రూ.3వేలు, సర్పంచ్ రమేష్ రూ.5వేలు, కుమ్మరి శంకర్ రూ.5వేలు, యవకులు రూ.12వేలను మల్లేశ్ కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు. కృష్ణగౌడ్, స్వామి, సత్యం, రాములు, శ్రీశైలం, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

58,59 జీఓ దరఖాస్తులపై విచారణ

ఇబ్రహీంపట్నం: జీఓ నంబర్ 58,59కు అనుగుణంగా భూముల అసైన్‌మెంట్, క్రమబద్ధీకరించుకునేందుకు పెట్టుకున్న దరఖాస్తుల విచారణ శుక్రవారం ప్రారంభమైంది. ఇబ్రహీంపట్నం మండలంలో అర్జీల విచారణ అధికారిగా గిరిజను ప్రభుత్వం నియమించింది. 58 జీఓ కింద 174, 59 జీఓ కింద 365 దరఖాస్తులు వచ్చాయి. గిరిజ నేతృత్వంలో బృందం దరఖాస్తుదారుని ఇంటింటికి వెళ్లి, విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు.

ఘనంగా లలిత సహస్రనామ యజ్ఞం



సహస్రనామ యజ్ఞంలో భక్తులు

ఆమనగల్లు: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ లలిత సహస్రనామ యజ్ఞం నిర్వహించారు. మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు, గోమాత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు గిరీశ్ శర్మ, శ్రీనివాస్ శర్మ, కృష్ణమాచార్యులు, శివానందస్వామిల ఆధ్వర్యంలో యజ్ఞం, సామూహిక కుంకుమార్చన అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైశ్య గురుసేవా రత్న బిరుదాంకితురాలు స్వరూపరాణి సహస్రనామ పారాయణం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ బికుమాండ్ల యాదయ్య, ఉపాధ్యక్షుడు బికుమాండ్ల పాండయ్య, నాయకులు చంద్రశేఖర్, శ్యాం, కృష్ణయ్య, శేఖర్, జగదీశ్, గోపాల్, మల్లేశ్, కృష్ణయ్య, జగన్, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన రమేశ్‌కు రూ.56 వేలు, కల్యాణ్‌కు రూ.60 వేలు, ఆమనగల్లుకు చెందిన సనా సిమ్రాన్‌కు రూ.14 వేలు, కడ్తాల మండలం ఎక్వాయిపల్లికి చెందిన జయమ్మకు రూ.16 వేలు, తలకొండపల్లి మండలం రాంపూర్‌కు చెందిన శిరీషకు రూ.19 వేలు మంజూరు కాగా.. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, శంకర్, జోతయ్య, రాములుయాదవ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

రైతుబంధు జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని రైతుబంధు జిల్లా చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. సీతారాంపేటలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రాష్ట్రంలో, నియోజకవర్గంలో పేదల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, ఇదే విషయాన్ని ప్రజలకు చెప్పాలని వెల్లడించారు. కార్యక్రమలో పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ కొంద్రు శ్రీలత, బీఆర్‌ఎస్ నాయకులు వంశీకృష్ణారెడ్డి, రాంబాబు, జనార్దన్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, రవి, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

10న అంగన్‌వాడీ ఆలిండియా డిమాండ్స్ డే

ఇబ్రహీంపట్నం: ఈ నెల 10న జరిగే అంగన్‌వాడీ ఆలిండియా డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, జాతీయ విద్యావిధాన చట్టాన్ని రద్దు చేయాలని, 45ఐఎల్‌సీ ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు రూ.26 వేల వేతనం చెల్లించి, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందులో భాగంగా ఈ నెల 10న బ్లాక్ డే నిర్వహించి, 10 కిలో మీటర్ల పాదయాత్రను కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టనున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ టీచర్స్ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బుగ్గరాములు, అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, అమరావతి, లక్ష్మి, విజయలక్ష్మి, పెంటమ్మ, పద్మలు పాల్గొన్నారు.

భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్యే లేకుండా మున్సిపల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించిన చైర్ పర్సన్
- వ్యతిరేకించిన పలువురు కౌన్సిలర్లు
- ఏక పక్షంగా వ్యవహరించారంటూ మండిపాటు
- గ్రూపు తగాదాలతో అభివృద్ధి కుంటుపడుతుందంటూ పుర ప్రజల మండిపాటు



భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు

తుర్కయంజాల్: మున్సిపల్ భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం వర్గ విభేదాలకు దారితీసింది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించాల్సి ఉండగా.. మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ఆమె వర్గంతో కలిసి, ఎమ్మెల్యే వచ్చే వరకు ఎదురు చూడకుండా పనులను ప్రారంభించడం వివాదానికి దారితీసింది. ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించాల్సిన పనులను చైర్ పర్సన్ ఏకపక్షంగా వ్యవహరించారంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అనిత వర్గానికి చెందిన కౌన్సిలర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీతో కలిసి అధికార పార్టీ కౌన్సిలర్లు మరోసారి పనులను ప్రారంభించడం గమనార్హం.

మొదటికి వచ్చిన పంచాయితి

తుర్కయంజాల్ రెవెన్యూలోని సర్వే నంబర్ 279లో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను 2022 ఫిబ్రవరి 9వ తేదీన మంత్రి కేటీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. అనంతరం ఈ భూమిపై కోర్టుల్లో కేసులు వేయడంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జోక్యంతో అన్ని అడ్డంకులు తొలగినట్లు తెలుస్తోంది. ముగిసినట్లే ముగిసిన పంచాయితి శుక్రవారం నాటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మొదటికి వచ్చిందని పలువురి అభిప్రాయం.

వార్డు కార్యాలయాల్లోనే పాలన...

సుమారు 50వేల మంది ఓటర్లు, లక్షకు పైగా జనాభాతో రాష్ట్రంలోని పెద్ద మున్సిపాలిటీల్లో తుర్కయంజాల్ ఒకటి. నగరానికి ఆనుకుని ఉండటంతో అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో తుర్కయంజాల్‌కు చోటు కల్పించింది. మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఒక్క చోటనే కూర్చుని పని చేయడానికి అనువైన కార్యాలయం లేకపోవడంతో.. పాత జీపీ భవనాల్లోనే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తుర్కయంజాల్, రాగన్నగూడలో కార్యాలయాలు ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పనుల నిమిత్తం అధికారులను కలవడానికి వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటికి ముగింపు పలకాల్సిన ప్రజా ప్రతినిధులు.. పంతాలకు పోయి అభివృద్ధికి ఆటంకంగా మారారని పలువురు విమర్శిస్తున్నారు.

నిధులు వెనక్కి

సర్వే నంబర్ 212లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించిన మరుసటి రోజే, కొందరు కోర్టును ఆశ్రయించి ఆ పనులను అడ్డుకున్నారు. దీంతో దానికి కేటాయించిన రూ.4కోట్లు వెనక్కి పోయినట్లు సమాచారం. పక్కనే ఉన్న మున్సిపాలిటీల్లో మోడల్ మార్కెట్ల నిర్మాణం జరుగుతున్నా.. ఇక్కడ గ్రూపు తగాదాలతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని, ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మా గ్రామాన్ని మాడ్గులలోనే ఉంచండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్లచెరువు గ్రామస్తులు

ఆమనగల్లు: నల్లచెరువు గ్రామాన్ని మాడ్గుల మండలంలోనే ఉంచాలని నల్లచెరువు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతి పత్రం అందజేశారు. మాడ్గులకు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న నల్లచెరువు గ్రామాన్ని 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇర్విన్ మండలంలో విలీనం చేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ స్రవంతికి సన్మానం

ఇబ్రహీంపట్నం: ఒగ్గు కళాకారుల భవనం కోసం సర్వే నంబర్ 43లో 200 గజాల స్థలాన్ని కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిని కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు పట్నం ఐలయ్య, శంకరయ్య, లింగం, మల్లేశ్, శ్రీశైలం, లింగం పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న ఒగ్గు కళాకారులు